# ఆమె నవ్వింది

డి.బి. వెంకటరత్నం

"చిల్లర వుండాలండీ అందరిదగ్గరా.... చిల్లర వుంచేనే బస్సులో ఎక్కండి...." కండక్టర్ హెచ్చరికలు.

"అరె....కొంచెంపైకి జరగండయ్యా!"

"ఇంకెక్కడికి జరగాలీ...."

"అబ్బా! నా కాలు....కాలు తొక్కేసినావయ్యా బాబూ."

"అబ్బెబ్బె! ఆర్టీ సీలో ఛస్తున్నాం మాస్టారూ. ఇదివరకటి ప్రయివేటు బస్సులే నయ్యం...."

"ఏటింత సేపు ఆపేసినావు.పోనీవయ్యా."

"కండక్టరూ.రెండూ అరవై విచ్చుకో."

"ఇరవయి పైసలు చిల్లరియ్య ఆఁ.... ఎవరండీ టిక్కెట్స్."

"ఇదిగో. సీతమ్మదార ఒకటి."

"సింధియాకోటి. డైరాకోటి."

లెఫ్ట్‌హేండ్ సైడ్ సింగిల్ సీట్లో కూర్చున్న నాకు. మాటలన్నీ విడివిడిగా కలగాపులగంగా.... గొడవ గొడవగా వినబడుతున్నాయి.

విశాఖ సిటీబస్సులో రోజూ ఈ బాధలు తప్పవు.

బస్సు నిండిపోయి ఇరుగ్గా. చిరాగ్గా ఉంది.

అయినా. కూర్చోటానికి చోటు దొరింది కనుక కొంతలో కొంత నయం.

నా పక్కన నుంచున్నతని చెయ్యి తల మీద గట్టిగా తగిలింది.

"సారీ....!" గబుక్కున అన్నాడు.

తల తడుముకుంటూ అతనివైపు చూశాను. ఒకచేత్తో కుర్రాడ్ని ఎత్తుకుని. మరో చేత్తో బస్సుకడ్డీ పట్టుకుని అవస్థ పడుతున్నాడు.

అతన్ని చూస్తుంటే జాలేసింది.

చేతులు చాపి. అతని చేతిలో కుర్రాడ్ని అందుకుని నాఒళ్ళో కూర్చోపెట్టుకున్నాను. రెండు సంవత్సరాలు ఉంటుంది ఆ కుర్రాడి వయసు. మహా చలాకీగా ఉన్నాడు.

కాసేపు నా జేబులో కాయితాల్తోనూ. మరికాసేపు నా జుట్టుతోనూ ఆటలాడాడు. జుట్టు విడిపించుకుని కుదురుగా కూర్చోపెట్టాను. అబ్బే ఉంటేనా! కూర్చునే వచ్చీరాని మాటల్తో అల్లరి చేస్తున్నాడు.

బస్సు సింధియా జంక్షన్‌కి వచ్చేసరికి కాస్త ఖాళీ అయ్యింది.

అప్పుడు చూశాను- ముందువైపు నుంచుని నావైపు చూస్తున్న ఆమెని.

అందంగానే ఉందని చెప్పాలి. చేతిలో లావాటి బైండ్ బుక్. బహుశా యూనివర్సిటీ అమ్మాయి అయివుంటుంది

నేను ఆమెవైపు చూడగానే క్షణంలో.... సగంలో. ఆమె పెదవులమీద మెరిసి మాయమైన చిరునవ్వు. అంతకంటె ఏం కావాలి?



అదీగాక. అప్పుడప్పుడూ ఆమె వెనుతిరిగి చూస్తూనే ఉంది. నా నవ్వుకి చిరునవ్వు సమాధానాలు లభిస్తునే ఉన్నాయి.

ఆమె ఎక్కడ దిగుతుందో....మనం కూడా అక్కడే దిగేస్తే....జగదాంబలో పిక్చర్ చూపించి. అట్నుంచి అలా అలా—

అదుపు తప్పిన మనసు ఇష్టంవచ్చినట్టు ఆలోచిస్తోంది.

ఆమె పేరు ఏమయి ఉంటుంది....

పద్మ....పార్వతి . లక్ష్మి..అన్నపూర్ణ.. తెలుగుపేర్లు వరుసగా మనసులోకి వస్తున్నాయి.

ఏ పేరయితేనేం అమ్మాయి బాగుంది.

చుఱుక్కుమంది.

ఒళ్ళో కూర్చున్న కుర్రాడు మీసం పట్టుకుని లాగేడు. అప్పుడు వచ్చింది అయిడియా.

ఈసారి ఆమె వెనక్కి తిరగ్గానే వాడి బుగ్గమీద ముద్దులు పెట్టుకున్నాను—కళ్ళతో ఆమెకి సందేశం పంపుతూ.

చటుక్కున అటు తిరిగిపోయింది. మళ్ళీ వెనక్కి తిరగలేదు.

బస్సు చావులమదుం దగ్గర ఆగింది. నా చేతిలో కుర్రాడ్ని తీసుకుని 'థాంక్స్' చెప్పి దిగిపోయాడు నా ప్రక్కనుంచున్నవ్యక్తి.

ఆమె కోసం చూశాను.

బస్ దిగుతోంది.

దిగుతూ ఓరగా చూసింది. ఆమె పెదాల మీద నవ్వు మెరసి మాయమైంది.

బస్సు కదిలింది.

మరి కాసేపు ఆపకూడదూ! వీడి సొమ్మేం పోయిందీ-మనసులో బస్ డ్రైవర్ని తిట్టుకుంటూ ఆమె కోసం బస్సులోంచి వెనక్కి చూశాను.

ఆమె పిల్లాడ్ని అందుకుంటూంది అతని నుంచి.ఆ కుర్రాడు అంతవరకూ నా ఒళ్ళో కూర్చున్నవాడే!

"అంటే....అంటే...."

ఇక ఆలోచించడం మానేసి తల బస్సులోకి తిప్పేశా!

---

"అయితే గాయకుడు హరిశ్చంద్ర నీకు బాగా తెలుసంటావ్."

"తెలుసు అనడమేమిటి....వాడూ, నేనూ ఓనమాల నుంచి ఉద్యోగం వచ్చేవరకూ సహాధ్యాయులం. ఒకే కంచంలో తినేవాళ్ళం. ఒకే మంచంలో పడుకునేవాళ్ళం. పి.జిలో. ఉండగా వాడు నన్ను ప్రత్యేకంగా బీచ్‌కు తీసుకువెళ్ళి పాటలు పాడి మరీ వినిపించేవాడు. నేనూ అంతే. మనసెప్పుడైనా బాగోకపోతే. వాడిని నిద్రపోతున్నాసరే లేపి పాడించి వినేవాడిని. అనకూడదుగానీ వాడు నా స్నేహితుడని చెప్పుకోవడం నాకు గర్వకారణం."

"అయితే తప్పకుండా నాకు ఛాన్సుయిస్తాడన్న మాట."

"తప్పకుండా....నువ్వే చూస్తావుగా." ఆకాశవాణి కాంపౌండ్‌లోకి అడుగుబెడుతూ చంద్రం సూర్యానికి అభయం యిచ్చేశాడు.

ఎంక్వయిరీలో హరిశ్చంద్ర గురించి వాకబు చేస్తే రికార్డింగ్‌లో ఉన్నాడని తెలిసింది. పిలిపించమని విజిటర్స్ కార్నర్‌లో కూర్చున్నారు.

"అన్నట్టు .... చంద్రం .... నీ బియ్యే క్లాస్‌మేట్ ఎవడో యిక్కడే పని చేస్తున్నాడని అన్నావ్....అతన్నికూడా కలిస్తే ..." సూర్యం నస.

"అతన్నిచూచి ఎప్పుడో ఆరేళ్ళవుతుంది.